ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా సురేశ్


ఆగిరి వెంకటేష్ నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న సురేష్

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా పాలూరి సురేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆవులమందలోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ కార్యక్రమం ముగిసింది. అయితే అధ్యక్ష ఎన్నికలకు ఎవరూ నామినేషన్ వేయకపోవడంతో పాలూరి సురేశ్ ఎన్నిక ఏకగ్రీవమైంది. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు ఆగిరి వెంకటేష్, సికింద్రాబాద్ పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు మర్యాల జగదీశ్వర్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ జరిగింది. 2024–2026 కాలానికి సురేష్ అధ్యక్షులుగా కొనసాగుతారు. ఈ మేరకు అధ్యక్షుడిగా ఎన్నికైన సర్టిఫికెట్‌ను ఆగిరి వెంకటేష్ ఆయనకు అందించారు.

యూజీసీ డీన్‌కు శుభాకాంక్షలు


లావణ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న నిజాం కళాశాల అధ్యాపక బృందం

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ యూజీసీ డీన్‌గా నియమితులైన ప్రొఫెసర్ బి.లావణ్యను మంగళవారం పలువురు నిజాం కళాశాల అధ్యాపకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఓయూ వైస్ చాన్సలర్ ప్రొ.కుమార్‌ను, ఓఎస్డీ ప్రొ.జితేందర్ నాయక్‌లను కూడా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ అధ్యాపకుడు డాక్టర్ ఎం.మనోహర్, ప్రముఖచరిత్ర అధ్యాపకుడు డాక్టర్ ఎస్వీ రత్నం, ఇంగ్లిష్ విభాగం అధ్యాపకులు డా.పి.జీవన్, డా.రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడి ఎన్నిక


ఆనంద్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

లాలాపేట: సికింద్రాబాద్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన జి.ఆనంద్‌కుమార్ ఎన్నికైనారు. ఈ మేరకు మంగళవారం అసోసియేషన్ సభ్యులు ఆనంద్‌కుమార్‌ను గజమాలతో ఘనంగా సన్మానించారు. ఆనంద్‌కుమార్ రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దుర్గా వెంకటేష్, కోశాధికారి జి.నర్సింహా, ఉపాధ్యక్షులు ఎం. రాజు, కుంచం వెంకన్న, సంయుక్త కార్యదర్శులు వేముల శేఖర్, ఎం.డి. ఆజమ్, చేవెళ్ల రమేష్, టి.ఎర్రయ్య, కార్యవర్గం ఆలకుంట క్రాంతి, సుధాకర్, బోదాసు రాము, దేవేంద్ర, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

కార్పొరేటర్ హేమకు ఓయూ డాక్టరేట్


సామల హేమ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఈ మేరకు మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ పొందినవారి జాబితాను విడుదల చేసింది. జాబితాలో కార్పొరేటర్ సామల హేమ పేరును ప్రకటించారు. సీతాఫల్‌మండి డివిజన్ నుంచి చిన్న వయసులోనే రెండుసార్లు కార్పొరేటర్‌గా గెలుపొందిన సామల హేమ డాక్టరేట్ పొందడంతో పలువురు సీతాఫల్‌మండి వాసులు ఆమెను కలిసి అభినందనలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ వైస్ చాన్సలర్‌కు, గైడ్ ప్రొఫెసర్ సంపత్ కుమార్, రీసెర్చ్ చేయడానికి సహకరించిన టీ హబ్, వీ హబ్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

సాయిబాబాను అన్యాయంగా జైలులో పెట్టారు: ప్రొ.హరగోపాల్

ఉస్మానియా యూనివర్సిటీ: అంగవైకల్యం 90 శాతం మేర ఉన్న ప్రొ.సాయిబాబాను పదేళ్లు జైల్లో పెట్టడం అన్యాయమని, ఆయన విలువైన సమయం వృథా అయిందని రాష్ట్ర విద్యా సలహా మండలి చైర్మన్ ప్రొ.హరగోపాల్ అన్నారు. మంగళవారం ఆర్ట్స్ కాలేజీ న్యూసెమినార్ హాలులో సాయిబాబా సంతాప సభ జరిగింది. కార్యక్రమానికి ఓయూ రీసెర్చ్ స్కాలర్ ఆజాద్ అధ్యక్షత వహించగా ప్రొ.హరగోపాల్, పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఓయూ విశ్రాంత అధ్యాపకులు ప్రొ.గడ్డం లక్ష్మణ్, ఓయూ అధ్యాపకులు కాశీం, కొండ నాగేశ్వరరావు, అమంచి నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొని ప్రొ.సాయిబాబా పోరాట పటిమను స్మరిస్తూ నివాళులు అర్పించారు. సాయిబాబా స్ఫూర్తితో ఉపా రద్దు కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సాయిబాబా కూతురు మంజీరా, తమ్ముడు రాందేవ్, కాంగ్రెస్ పార్టీ నేత డాక్టర్ వరంగల్ రవి, పార్ట్‌టైం అధ్యాపకులు శరత్ చమర్, దళిత బహుజన, వామపక్ష సంఘాల విద్యార్థి నేతలు రవి నాయక్, నెల్లి సత్య, ఎస్.నాగేశ్వర్‌రావు, అఖిల్, శ్రీకాంత్, బట్టు వెంకటేశ్వర్లు, ఉదయ్, సునీల్, వేదంత మౌర్య పాల్గొన్నారు.

మహబూబ్ కళాశాల కబ్జాకు కుట్ర


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పీఎల్ శ్రీనివాస్

రాంగోపాల్‌పేట్: దశాబ్దాల చరిత్ర కలిగిన మహబూబ్ కళాశాలను కబ్జా చేసేందుకు కొంత మంది ప్రయత్నిస్తున్నారని మహబూబ్ స్కూల్ అండ్ కాలేజ్ ఎడ్యుకేషన్ ట్రస్టు ప్రెసిడెంట్ పీఎల్ శ్రీనివాస్ ఆరోపించారు. మంగళవారం ఆయన స్కూలు ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ 2019లో ట్రస్టు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సమయంలో విద్యాసంస్థల నిర్వహణకుగాను కేవీకే రావు అనే వ్యక్తికి లైసెన్సు ఇచ్చామని చెప్పారు. లాభాల్లో సగం ఇవ్వడంతోపాటు, నెలవారీ అద్దె చెల్లించాలని ఒప్పందం కుదుర్చుకున్నామని, అయితే లైసెన్సును అడ్డుపెట్టుకుని కేవీకే రావు మొత్తం కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తాము కళాశాల ప్రాంగణంలోకి రాకుండా గూండాలు, బౌన్సర్లతో అడ్డుకుంటున్నారని, మహబూబ్ కళాశాలను కబ్జా చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు డాక్టర్ ప్రేమ్ నారాయణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి


నామాలగుండు నాగదేవత ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో మల్లికార్జునుడు

చిలకలగూడ: నాగులచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని నాగదేవత ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సీతాఫల్‌మండి డివిజన్ నామాలగుండు నాగదేవత, చిలకలగూడ నాగలక్ష్మీ ఆలయాల వద్ద మంగళవారం వేకువజాము నుంచే బారులు తీరిన భక్తులు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు. ఆయా ఆలయాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ అనుదీప్ తెలిపారు.

సనత్‌నగర్‌లో..

సనత్‌నగర్: సనత్‌నగర్ జెక్‌కాలనీలోని నాగదేవత ఆలయం, సనత్‌నగర్ ఇండస్ట్రియల్ పార్కు తదితర చోట్ల నాగదేవతకు ప్రత్యేక పూజలు జరిపారు. పసుపు, కుంకుమ, పాలు, గుడ్లను నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలోని శివాలయంలో నాగుల చవితిని పురస్కరించుకుని శివలింగంపై నాగదేవత రూపాలతో అలంకరించిన తీరు భక్తులను కనువిందు చేసింది. ఈఓ సత్యనారాయణ పర్యవేక్షణలో అర్చకులు రిపుంజయశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిపారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి: తలసాని


కళ్యాణలక్ష్మీ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: ప్రజలకు ప్రయోజనం చేకూర్చే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్ డివిజన్‌కు చెందిన ముగ్గురు లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ పథకం కింద మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లబ్ధిపొందిన వారు తమ పరిసరాల్లోని అర్హులకు తెలియజేసి సద్వినియోగం చేసుకునేవిధంగా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, నాయకులు బాల్‌రెడ్డి, శేఖర్, రాజేష్, రాజు పాల్గొన్నారు.

మంచినీటి సమస్యలపై స్పందించండి


వాటర్‌వర్క్స్ జీఎం, డీజీఎంల దృష్టికి సమస్యలను తీసుకువెళ్తున్న మహేశ్వరిశ్రీహరి

అధికారులను కోరిన కార్పొరేటర్ మహేశ్వరి

సనత్‌నగర్: బేగంపేట డివిజన్ పరిధిలో నెల కొన్న మంచినీటి లో ప్రెషర్, డ్రైనేజీ ఓవర్‌ఫ్లో సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి జలమండలి జీఎం వినోద్, డీజీఎం ఆశిష్‌లను కోరారు. ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీ, శ్యాంలాల్‌బిల్డింగ్స్, మయూరిమార్గ్ తదితర ప్రాంతాల్లో మంచినీరు తక్కువ ప్రెషర్‌తో రావడం మూలంగా సరిపడా నీటిని పట్టుకోలేకపోతున్నామని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. వెంటనే నీటి సరఫరా ప్రెషర్‌ను పెంచాలన్నారు. బ్రాహ్మణవాడీలో డ్రైనేజీ పొంగిపొర్లడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్పందించిన జీఎం, డీజీఎంలు ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. కార్పొరేటర్ వెంట సీనియర్ నేత శ్రీహరి తదితరులు ఉన్నారు.

హామీలు ఎప్పుడు నెరవేరుస్తారు: తలసాని

రాంగోపాల్‌పేట్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన తులం బంగారం హామీని ఎప్పుడు నెరవేరుస్తారో చెప్పాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సికింద్రాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో బన్సీలాల్‌పేట్, రాంగోపాల్‌పేట్, మోండా డివిజన్లకు చెందిన 70 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, 12 మందికి షాదీ ముబారక్ చెక్కులను ఆయన అందించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ తులం బంగారం హామీ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లాలని ఆయన ఆర్డీవో, తహసీల్దార్‌లను కోరారు. లబ్ధిదారులకు అందించే ఆర్థిక సహాయంలో జాప్యం జరుగుతోందని, దీన్ని నివారించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సాయిరామ్, తహసీల్దార్ పాండు నాయక్, కార్పొరేటర్లు మహేశ్వరి, హేమలత, మాజీ కార్పొరేటర్లు అరుణగౌడ్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్, ఆకుల హరికృష్ణ పాల్గొన్నారు.

ప్రజాపాలన కేంద్రం ప్రారంభం




కంటోన్మెంట్: కంటోన్మెంట్ వాసులు ఇకపై తమ ప్రజాపాలన దరఖాస్తులను తిరుమలగిరిలో సమర్పించవచ్చని ఎమ్మెల్యే శ్రీగణేశ్ తెలిపారు. తిరుమలగిరి మండల కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేశ్ మాట్లాడుతూ ప్రజాపాలన దరఖాస్తుల కోసం ప్రజలు వివిధ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా తహసీల్దార్ కార్యాలయంలో సమీకృత సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ వంటి పథకాలకు దరఖాస్తులను ఈ కేంద్రంలో సమర్పించవచ్చన్నారు. ఈ కేంద్రం అన్ని పనిదినాల్లో ఉదయం 10.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సాయిరామ్, తహసీల్దార్ అశోక్ కుమార్, బీజేపీ నాయకులు మల్లికార్జున్, కాంగ్రెస్ నేతలు బల్వంత్ రెడ్డి, అష్రాఫ్, మారుతి గౌడ్ పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

చిలకలగూడ: ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... కార్వాన్ ఆసిఫ్‌నగర్‌కు చెందిన సీహెచ్ శ్రీనివాససాగర్(45) అఖిల భార్యభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భవన నిర్మాణ కార్మికునిగా పనిచేస్తున్న శ్రీనివాస్ సాగర్ సమీప బంధువులకు డబ్బులు అప్పు ఇచ్చాడు. ఎన్నిమార్లు అడిగినా తిరిగి అప్పు తీర్చకపోవడం, ఆర్థిక ఇబ్బందులతో కొంతకాలంగా మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో తీవ్ర అస్వస్థతకు గురైన శ్రీనివాస్ ఈ నెల 4వ తేదీన భార్య అఖిలతో కలిసి సికింద్రాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోగా ప్రాథమిక నిర్ధారణలో కేన్సర్‌గా తేలింది. ఈ క్రమంలో సీతాఫల్‌మండి డివిజన్ ఉప్పరిబస్తీలో ఉంటున్న అత్తవారింటికి కుటుంబంతో కలిసి వచ్చాడు. సోమవారం సాయంత్రం భార్య ఆసిఫ్‌నగర్ వెళ్లింది. మంగళవారం వేకువజామున అఖిల సోదరి రెండో అంతస్థుకు వెళ్లి చూడగా బాల్కనీలో తాడుతో ఉరివేసుకుని వేలాడుతూ శ్రీనివాస్‌సాగర్ కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. భార్య అఖిల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వృద్ధురాలి అదృశ్యం


ఆశా బాయి, ఫైల్‌ఫొటో

అడ్డగుట్ట: వృద్ధురాలు అదృశ్యమైన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శంకర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం... తుకారాంగేట్‌లోని మరాఠా బస్తీకి చెందిన లొండె ఆశాబాయి(65) గత నెల 15న ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఇది వరకు కూడా ఇలాగే వెళ్లిపోయిన ఆశాబాయి రెండ్రోజుల తరువాత తిరిగొచ్చింది. అయితే, ప్రస్తుతం రోజులు గడుస్తున్నాఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు బంధువులను వాకబు చేసినా, స్థానిక ప్రాంతాల్లో వెతికినా ఫలితం కనిపించలేదు. దీంతో ఆదివారం రాత్రి తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఫిజికల్ డైరెక్టర్ నర్సింగ్‌రావుకు ఓయూ డాక్టరేట్


ఫిజికల్ డైరెక్టర్ ఇ. నర్సింగ్‌రావు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ బన్సీలాల్‌పేట్ నివాసి, ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఇ. నర్సింగ్‌రావుకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. 'ఎఫెక్ట్స్ ఆఫ్ ప్లయోమెట్రిక్ ట్రెనింగ్ ఫర్ ద డెవలప్‌మెంట్ ఆఫ్ జనరల్ మోటార్ ఎబిలిటీస్ అమాంగ్ ద కబడ్డీ అండ్ ఖోఖో ప్లేయర్స్ ఆఫ్ ఉస్మానియా యూనివర్సిటీ' అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను నర్సింగ్‌రావు డాక్టరేట్ పట్టా పొందారు. ఉస్మానియా యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్ పర్యవేక్షణలో నర్సింగ్‌రావు పరిశోధన పూర్తి చేశారు. బన్సీలాల్‌పేట్ మురికివాడలోని బస్తీలో నిరుపేద కుటుంబంలో జన్మించిన నర్సింగ్‌రావు కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో అంచెలంచెలుగా ఎదిగారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందడం ఎంతో సంతోషంగా ఉందని నర్సింగ్‌రావు విలేకరులతో మాట్లాడుతూ అన్నారు.

పీడీఎస్‌యూ అమరులకు నివాళులు

ఉస్మానియా యూనివర్సిటీ: పీడీఎస్‌యూ అమరులకు ఓయూలో విద్యార్థులు నివాళులు అర్పించారు. మంగళవారం ఆర్ట్స్ కాలేజీ నుంచి ఇంజినీరింగ్ కాలేజీ వరకు భారీ నిర్వహించిన అనంతరం పీడీఎస్‌యూ నిర్మాతలు జంపాల, చంద్రశేఖర్, ప్రసాద్ చిత్రపటాలను ప్రదర్శిస్తూ నివాళులు అర్పించి వారి పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి సుమంత్, రుక్మత్ పాషా, వెంకటేష్, అంజి, కాంత్రి, పవన్, తిరుపతి, సాయి, సృజన, బిందు, సింధు, కీర్తి, భువన, మేఘన తదితరులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

బౌద్ధనగర్: పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ కంది శైలజ అధికారులను ఆదేశించారు. డివిజన్‌లోని కౌసర్ మసీదు సమీపంలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను ఆమె మంగళవారం పర్యవేక్షించారు. స్థానికులు ఇబ్బందులకు గురవ్వకుండా సీసీ రోడ్డు పనులను వీలైనంత తొందరగా పూర్తి చేయాలని, తప్పనిసరిగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని శైలజ సూచించారు. ఈ పరిశీలనలో బీఆర్ఎస్ నేత బాబా, బస్తీవాసులు పాల్గొన్నారు.

కండక్టర్ కళ్లలో కారం చల్లి దాడి.. నిందితులపై కేసు

అమీర్‌పేట: ఆర్టీసీ బస్సు కండక్టర్, డ్రైవర్ కళ్లలో కారం చల్లి, బస్సు అద్దాలు ధ్వంసం చేసిన వ్యక్తులపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మెహిదీపట్నం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మంగళవారం మధ్యాహ్నం అపురూప కాలనీ వెళ్లి తిరిగి డిపోకు బయలుదేరింది. బస్సు భరత్‌నగర్ వచ్చాక జంగ్లి పవర్ (20), డి.గౌరి(35), మరో ఇద్దరు మైనర్లు బస్సు ఎక్కి ఈఎస్ఐ వరకు టికెట్లు ఇవ్వాలని కోరగా కండక్టర్ ఒక్కొక్కరికి రూ.20 చొప్పున టికెట్లు ఇచ్చారు. భరతనగర్ నుంచి ఈఎస్ఐకి ఒక్కొక్కరికి చార్జి రూ.10 కాగా, రూ.20 చొప్పున ఎలా తీసుకుంటారని వారు కండక్టర్‌ను ప్రశ్నించారు. ఈ విషయంలో వాగ్వాదం చోటుచేసుకోగా కండక్టర్ ముగ్గురిని ఎర్రగడ్డ బస్టాప్‌లో దింపాడు. ఆగ్రహం చెందిన ఆ యువకులు కండక్టర్ కళ్లలో కారంపొడి చల్లి దాడి చేశారు. వారించబోయిన డ్రైవర్‌పై సైతం దాడి చేశారు. బస్సు అద్దాలను కూడా ధ్వంసం చేశారు. ప్రయాణికులు అప్రమత్తమై వారిని పట్టుకుని ఎస్ఆర్‌నగర్ పోలీసులు అప్పగించారు. కండక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా 31, నల్ల వంకాయ 50, పొడుగు వంకాయ 33, బెండకాయ 45, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 80, క్యాప్సికమ్ 80, పచ్చకాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 33, క్యారెట్ 80, దొండ 28, గుండుబీన్స్ 75, గింజ చిక్కుడు 95, గోకరకాయ 55, కీర 17, దోసకాయ 35, బీట్‌రూట్ 50, ఉల్లిగడ్డ 40, ఆలుగడ్డ 38, చామగడ్డ 40, మొరంగడ్డ 28, కందగడ్డ 65, సొరకాయ 15, పొట్లకాయ 23.

'గృహజ్యోతి' అమలులో గందరగోళం

- ఇంటి ఓనర్లకు తలనొప్పిగా మారిన వైనం
- పట్టించుకోని అధికార గణం

బన్సీలాల్‌పేట్: దారిద్ర్యరేఖకు దిగువనున్న పేదలు ప్రతినెలా 200 యూనిట్లలోపు కరెంట్ వినియోగించుకుంటే వారు గృహజ్యోతి పథకం కింద బిల్లు చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ పథకం కోసం సికింద్రాబాద్, పరిసర ప్రాంతాలకు చెందిన పేదలు జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకున్నారు. ఇంకా పలువురు దరఖాస్తు చేసుకుంటున్నారు. అయితే క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన, అర్హుల గుర్తింపు ప్రక్రియ తూతూమంత్రంగా మారింది. దీంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల హామీల్లో భాగంగా ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం అమలు తీరు గందరగోళంగా మారిందనే విమర్శలు సర్వత్రా విన్పిస్తున్నాయి. ఈ పథకానికి సంబంధించి సరైన అవగాహన లేకపోవడంతో అనేకమంది పేదలు లబ్ధి పొందలేకపోతున్నారు. జీహెచ్‌ఎంసీ, విద్యుత్ శాఖ అధికారుల మధ్య సమన్వయ లేమీ కారణంగా పేదలకు తిప్పలు తప్పడం లేదు. గృహజ్యోతి పథకం ఇంటి యజమాని, అద్దెదారుడి మధ్య చిచ్చుపెడుతోంది. దరఖాస్తు ఆధారంగా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి ఈ పథకానికి అర్హులను నిర్ధారించాలి. ఆచరణలో ఎక్కడ కూడా అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేయడం లేదు. అనర్హులను సైతం కొన్ని సందర్భాల్లో అర్హులుగా గుర్తుస్తున్నారు.

ఇంటి యజమాని, కిరాయిదారుల మధ్య చిచ్చు

అనుమతి, ప్రమేయం లేకుండా తమ ఇంటి నెంబర్‌పై దరఖాస్తు చేసుకొని ఎలా ప్రయోజనం పొందుతున్నారంటూ పలువురు ఇంటి యజమానులు కిరాయిదారులతో గొడవ పడుతున్నారు. ఇంటి య జమానులు గృహజ్యోతి పథకానికి అర్హులు కాకు న్నా పలు ప్రాంతాల్లో కిరాయిదారుల తెల్లరేషన్‌కార్డు ఆధారంగా సబ్సిడీ పొందుతున్నారు. ఇటు విద్యుత్ శాఖ నుంచి గానీ, అటు జీహెచ్‌ఎంసీ అధికారుల నుంచి గానీఎలాంటి సమాధానం రావడం లేదు. తెల్లరేషన్‌కార్డులో అడ్రస్ ఎక్కడ ఉంటే ఆ ఇంటికి మాత్రమే అర్హులకు కరెంట్ ఉచితంగా ఇవ్వాలని పలువురు అధికారులను కోరుతున్నారు.

రాహుల్ సభకు తరలిన కాంగ్రెస్ నేతలు



ఎమ్మెల్యే శ్రీగణేశ్ నేతృత్వంలో రాహుల్ గాంధీకి స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు


రాహుల్‌కి స్వాగతం పలికేందుకు వెళుతున్న సికింద్రాబాద్ కాంగ్రెస్ నేతలు

లాలాపేట: బోయిన్‌పల్లిలోని గాంధీ ఐడియాలజీ సెంటర్‌లో మంగళవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ సభకు సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు తరలి వెళ్లారు. అంతకంటే ముందుగా బేగంపేట విమానాశ్రయం వద్ద రాహుల్‌కు సికింద్రాబాద్ నియోజకవర్గ నాయకులు భారీగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో నియోజకవర్గం ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్, చింతల్ కిట్టు, శశాంక్, ప్రమోద్, వెంకట్, రాజు, నరేష్ తదితరులున్నారు.

రాహుల్‌కు కాంగ్రెస్ నేతల ఘనస్వాగతం

కంటోన్మెంట్: కంటోన్మెంట్ నియోజకవర్గం బోయిన్‌పల్లికి వచ్చిన రాహుల్‌గాంధీకి స్థానిక కాంగ్రెస్ నేతలు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే శ్రీగణేశ్ నేతృత్వంలో వందలాది మంది నేతలు, కార్యకర్తలు తాడ్‌బండ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన వేదిక ద్వారా రాహుల్‌కు అభివాదం తెలిపారు. బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి బోయిన్‌పల్లికి వెళ్లేమార్గంలో తాడ్‌బండ్ వద్ద గుమిగూడిన పార్టీ శ్రేణులకు రాహుల్ అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. గాంధీయన్ ఐడియాలజీ సెంటర్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశం ముగిశాక తిరిగి అదే మార్గంలో బేగంపేటకు వెళ్లే క్రమంలో బోయిన్‌పల్లి చౌరస్తాలోనూ పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు రాహుల్‌కు వీడ్కోలు పలికారు.

7 నుంచి ఐనోన్ చర్చి గ్రేస్ ఫెస్టివల్స్

లాలాపేట: తార్నాక ఐనోన్ చర్చి ఆధ్వర్యంలో నవంబర్ 7, 8, 9, 10 తేదీల్లో గ్రేస్ ఫెస్టివల్స్–2024ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఐనోన్ మినిస్ట్రీస్ సీనియర్ పాస్టర్ రెవరెండ్ ఆర్ విలియం కేరి మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. నాచారం హెచ్‌ఎంటీలోని ఏఎస్ఆర్ గార్డెన్‌లో నాలుగు రోజులపాటు ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు కృప పండుగులు జరుగుతాయన్నారు.

ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి


మహాధర్నాకు తరలివెళుతున్న ఆటోడ్రైవర్లు

లాలాపేట: ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలంటూ జైభీం ఆటోరిక్షా, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన మహాధర్నాకు జైభీం ఆటో యూనియన్ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి సీహెచ్ మల్లికార్జున్ ఆధ్వర్యంలో పలువురు ఆటో డ్రైవర్లు తరలివెళ్లారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఆటోడ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ బస్సుల్లో అమలు చేస్తున్న మహాలక్ష్మీ పథకంతో మహిళలెవరూ ఆటోల్లో ప్రయాణించడం లేదన్నారు. దీంతో ఆటోడ్రైవర్లకు సరైన గిరాకీ లేక ఉపాధి కరువైందని విచారం వ్యక్తం చేశారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆటోడ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. గత ఎన్నికల ముందు ప్రకటించిన ఆటోడ్రైవర్లకు రూ.12 వేల ఆర్థిక సహాయం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకటేష్, బాల్‌రాజు, మహేశ్, కేశవ్ తదితరులున్నారు.

10న బొల్లారంలో ఎమ్మార్పీఎస్ సభ


బొల్లారంలో సమావేశమైన ఎమ్మార్పీఎస్ నేతలు

రసూల్‌పురా: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణను అమలు చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈ నెల 10న కంటోన్మెంట్ నియోజకవర్గంలోని బొల్లారంలో భారీ సభ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం కంటోన్మెంట్ ఇన్‌చార్జి ఇటుక శ్రీకిషన్ మాదిగ తెలిపారు. బొల్లారం రిసాలబజార్‌లో మంగళవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల బొల్లారంలో జరిగిన మాలల సమావేశంలో ఎమ్మెల్యే వివేక్ వెంకట్ స్వామితోపాటు మరికొందరు ఎస్సీ వర్గీకరణ విషయంలో అనేక అపోహాలు ఉన్నాయని, వర్గీకరణకు మాలలు వ్యతిరేకమని ప్రకటించారని అన్నారు. వర్గీకరణపై వ్యతిరేక వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు అజిత్, కళ్యాణ్, మురళి, అర్జున్, నవీన్, చిన్నా, రొట్టెల సునీల్ మాదిగ, ఈఆర్ బాలరాజు, జె.దశరథ్, సుధాకర్, నర్సింగ్‌రావు, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.